ఆమె తనకే
సొంతం కావాలనుకున్న
అతని కోరిక
నెరవేరిందా?

# ప్రవాహం

## గోపాలుని రఘుపతిరావు కథ

**రా**ణి అందాల భరిణ. ఎత్తుకు తగ్గ లావు. చంద్రబింబంలాంటి ముఖం. తీరయిన కనుముక్కుతో ఇట్టే ఆకర్షించే రూపం. ఆమెను చూస్తే ఏ మగాడైనా శాశ్వతంగా స్వంతం చేసుకోవాలనుకుంటాడు. కానీ ఆమెది ఓ మగాడికి కట్టుబడి వుండే స్వభావంకాదు. అందుకే ఎందరో ఆమెదగ్గరకు వచ్చిపోతుంటారు. అందుకే ఆమెను వెలయాలన్నారు. అందరిలానే ఓ రోజు వీర్రాజు వచ్చాడామెదగ్గరకు. అతను ఓ లారీ డ్రైవరు. ఓరోజు బజార్లో ఆమెను చూశాడు. ఆమె నవ్విందతన్ని చూసి. అంతే అతను ఆమె వెనుకపడ్డాడు.

ఇసక వీధిలో ఓ ఇల్లు వుందామెకు. వీర్రాజుని లోనికి ఆహ్వానించింది. కుర్చీ చూపించింది. ఇదేమీ అతనికి పట్టడంలేదు. అతనికి ఆమె కావాలి!

''ఒక్కర్తివే వుంటున్నావా? ఇంట్లో?''పరిశీలనగా అడిగాడు.

''ఏం? వుండకూడదా?'' కవ్విస్తూ అడిగిందామె.

''ఆహా! లక్షణంగా వుండొచ్చు!! వూరికే అడిగాలేవే!'' మీసం మీదకు చెయ్యిపోనిస్తూ అన్నాడు.

''ఏవే, గీవే అనొద్దు చెప్తున్నాను'' అభిమానం ముంచుకొచ్చి అంది.

''అట్టాగేలేవే! నీపేరేంది మరి?''

''రాణి!''

''చూశావా, నా పేరు రాజు! వీర్రాజు!! పేర్లెంత బాగా కలిశాయో చూడవే!'' అట్టహాసం చేస్తూ అన్నాడు.

''కాఫీ తెచ్చిన ఆమె చేతిని వొడిసి పట్టుకుని కాఫీ గ్లాసు అందుకుని బల్లమీద పెట్టాడు. తన కౌగిలోకి లాక్కున్నాడు. ఆమె అభ్యంతరపెట్టలేదు. ఒదిగిపోతూ, ''అంతా తొందరే!'' అంది.

వీర్రాజు మాట్లాడలేదు. ఆమె ముఖాన్ని



అందినచోటల్లా చుంబించాడు. ఓరగా వేసున్న తలుపుకు గడియపెట్టాడు.

అప్పణ్ణుంచి వీర్రాజు ప్రతిరాత్రీ వస్తున్నాడామె దగ్గరకు. ఆమె మరొకర్ని కన్నెత్తి చూడగూడదని శాసించాడు.

''ఏం, నీ పెళ్లాన్నా?'' అని నిలదీసింది.

''అంతకన్నా ఎక్కువేలేవే!'' గుంభనంగా అన్నాడు వీర్రాజు.

ఈ వ్యవహారం కొంతకాలమిలా సాగింది గుంభనంగా.

ఓ సాయంత్రం రాణి ఇంటికి వచ్చిన వీర్రాజు ఆమె మరో వ్యక్తితో గడపడం చూసి పళ్లు పటపటలాడించాడు. వాడు నిష్క్రమించాక ఆమెను నిలదీశాడు. ఆమె అన్నది.

''నేనెవరితో వున్నా, నీవు నావాడివే! అంత గుబులెందుకు?''

''అన్నీ నే జరుపుతానే. మరోడితో పోకు!'' అన్నాడు పిడికిలిపై మరో చేత్తో రాస్తో!

''అట్టాగేలే మావా!'' అంది. కాని మాట నిలబెట్టుకోలేదు. మరోసారి, మరోసారి, మరో మరో మగాళ్లే చూస్తూనే వున్నాడామెతో. సహనం నశించింది. కాని కట్టడి సేయడాన్కి తన పెళ్లాం గాదే! ఈ విధంగా ఆలోచించి రాణి దగ్గరకు రావడం మానేశాడు.

రాణి రోజుకొకడితో తిరుగుతూనే వుంది. ఆమెకు చిన్నా, పెద్ద, వావి, వరుస లేదు. అందిన మగాళ్లే ఆదరిస్తోంది. అందరినీ పారితోషికం కోసమే అనుకుంటే పప్పులో కాలేసినట్లే! కొందర్ని డబ్బుకోసమయితే, మరికొందర్ని మజాకోసం.

బాడుక్కి హైదరాబాద్ వెళ్లి తిరిగొచ్చిన వీర్రాజుకి సడన్‌గా రాణి గుర్తొచ్చింది. ఆమెను చూస్తే అదేదో మత్తు ఆవరిస్తుందతనికి. ఆమె లేకుండా వుంటానికి శతధా ప్రయత్నించాడు. కానీ మరో ఆడదానిదగ్గరకు పోదామని ప్రయత్నించినా మనస్కరించడంలేదు. బజార్లో కూరల బుట్టతో అటుగా వస్తున్న రాణిని చూసి లారీ దిగి పలకరించాడు.

''బావున్నావా? రావడంలేదేం?'' మురిపెంగా ప్రశ్నించిందామె.

''ఏం బాగోలేవే! జీవితం ఏదోలా గడుస్తోందే తప్ప ఏ సుఖమూ, మజా లేదు'' అన్నాడు వేదాంతంగా.

ఆమె ఆహ్వానిస్తే మరల ఇంటికి వెళ్లాడు. అదే ఆప్యాయత, అదే మమకారం చూపింది తనంటే. ఆమెను ఒడిసి దగ్గరకు లాక్కుని ఆమె యెదలో తలదాచుకున్నాడు.

''రాణీ, నీవు లేందే నేను బతకలేను. మరోడితో తిరక్కే!'' అన్నాడు వేడికోలుగా.

''అట్టాగేలే మావా!'' అంది నమ్మకంగా. ఆమెను మంచంమీదకి లాక్కున్నాడు తమకంగా.

''ఇయ్యాల సాయంత్రం మళ్లీ కిరాయికి పోతున్నాను. మూడు రోజులయ్యాక మళ్లీ కలుస్తాను'' అంటూ నోట్ల పొత్తి ఒకటి ఆమె చేతిలో పెట్టాడు. ఆమె వాటివంక చూస్తూ చిరునవ్వుతో అందుకుంది. మూణ్ణాళ్ల తర్వాత వీర్రాజు స్నేహితుడొకడు కలిశాడు. ''రాణిదగ్గరకు వెడుతున్నావా?'' అడిగాడు.

అవునన్నాడు వీర్రాజు.

''అది సెడతిరుగుతోందిరా! ఎవరెవరితోనో అది తొంగోటం నా కళ్లారా చాలాసార్లు చూశా!'' అన్నాడు.

వీర్రాజు నిర్వేదంగా నవ్వాడు. ''ఎందరెందరితోనో తిరిగానురా చిట్టీ! కానీ రాణి పరిచయమయ్యాక నాకు మరో ఆడది కంటికానడంలే! అందుకే తిరుగుళ్లు తగ్గించి దానితోడిదే లోకమనుకుంటున్నాను'' కంఠం ఆర్ద్రం కాగా అన్నాడతను.

రాణి ఇంటికి వెళ్లాడు. గట్టిగా నిలదీశాడు. మరోడితో తిరగొద్దని శాసించాడు. బ్రతిమాలాడు, భంగపోయాడు.

''అట్లాగేలే మావా!'' అనే రాణి ఈవేళ కొత్తగా మాట్లాడింది.

''మావా నీవ్వేమనుకోకు. నే సెప్పేది విను. నువ్వుకూడా అందరిలానే పరిచయమయ్యావు.

అందరికంటే ప్రత్యేకంగా చూశావు. నేనూ అలాగే చూసుకున్నాను. నేను వెలయాల్ని. నాలో పవిత్రత ఏడుంది? కొన్ని వందల మంది నడిచే రహదారిలాంటిదాన్ని. చెడినదాన్ని. నీ ఒక్కడికే సొంత ఎలా అవుతాను మావా? నీవు మనసు పడ్డప్పుడు నా దగ్గరకి రా! తప్పకుండా రా!! నా తలుపులు నీకోసం ఎప్పుడూ తెరిచే వుంటాయి. కానీ నేను నీ ఒక్కడికే సొంతం అనుకోవూాక!'' ఉపన్యాసమిచ్చింది రాణి.

వీర్రాజు నిర్విణ్ణుడయ్యాడు. ''అవున్లే. పదిమందితో పరిచయాలున్న రాణి నా ఒక్కడికే సొంతమెలాగవుద్ది?'' అనుకున్నాడు.

అతనికి ఆనకట్ట గుర్తొచ్చింది. ''నదిలో వరదనీటి ప్రవాహాన్ని ఆనకట్టతో పూర్తిగా బంధించగలమా? ఎక్కువయిన నీరు లాకులు ఎత్తాలి, పొంగిపొర్లాలి! లేకుంటే ఆనకట్ట బీటలువారి బద్దలయ్యే ప్రమాదముంది!'' అనుకున్నాడు బీడీ వెలిగించుకుంటూ!

